# అప్పుల ఊబిలోకి రాష్ట్రం..

-మొదటిపేజీ తరువాయి

ఇది చాలా ప్రమాదకరమైన ఆర్థిక నిర్వహణ అని హెచ్చరించింది. గ్యారంటీ అప్పులు జీఎస్‌డీపీలో ఏకంగా 15.1 శాతానికి చేరాయని వెల్లడించింది. నిధులన్నీ సంక్షేమం, సబ్సిడీలకే పోతున్నాయని.. భవిష్యత్తుకు కీలకమైన విద్య, వైద్య రంగాలను గాలికి వదిలేశారని తూర్పారబట్టింది. బడ్జెట్ అంచనాలు ఏకంగా 21 శాతం గల్లంతవుతుండటం ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యానికి అద్దం పడుతోందని నివేదిక పేర్కొంది. స్టేట్ ఆఫ్ ఫైనాన్సెస్'నివేదిక తెలంగాణ రాష్ట్ర ఖజానా డొల్లతనాన్ని బయటపెట్టింది. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని హెచ్చరించింది. ప్రభుత్వ రంగ సంస్థల కోసం ఇచ్చిన గ్యారెంటీలు జీఎస్‌డీపీలో 15.1 శాతానికి చేరగా, ఇందులో సింహభాగం (37%) నీటిపారుదల రంగానికే ఉండటం గమనార్హం. దేశంలో మరే రాష్ట్రం ఇంతటి భారీ గ్యారెంటీలను ఇవ్వలేదని నివేదిక పేర్కొంది. ఈ గ్యారెంటీలకు తోడు, 2025 మార్చి నాటికి అధికారిక అప్పులు సైతం జీఎస్‌డీపీలో 26 శాతానికి చేరాయి. ఇది ఎఫ్ఆర్‌బీఎం కమిటీ నిర్దేశించిన 20% పరిమితి కంటే చాలా ఎక్కువ. రాష్ట్రం బడ్జెట్ వెలుపల చేసే అప్పులు కూడా కొనసాగుతున్నాయి. 2024%-%25లో ఇవి రూ.2,697 కోట్లుగా ఉన్నాయి.

**కాగితాలపై కోటలు.. వాస్తవాలకు బీటలు**

పీఆర్ఎస్ నివేదిక ప్రకారం రాష్ట్ర బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు ఏమాత్రం పొంతన కుదరడం లేదు. 2015%-%23 మధ్య కాలంలో బడ్జెట్‌లో వేసిన అంచనాలకు, వాస్తవంగా వచ్చిన ఆదాయానికి మధ్య ఏకంగా 21% వ్యత్యాసం (లోటు) కనిపించింది. దేశంలో అత్యంత దారుణమైన పనితీరులో ఇది ఒకటి అని నివేదిక పేర్కొంది. కాగితాలపై కోటలు కట్టడం, తీరా ఆదాయం రాకపోవడంతో.. చివరకు అభివృద్ధి పనులకు భారీగా కోత పెట్టాల్సి వస్తోంది. ఇదే కాలంలో రాష్ట్రం తన మూలధన వ్యయంలో 12% కోత విధించింది. రాష్ట్రం సొంత ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో బలంగా ఉంది. మొత్తం ఆదాయంలో 77% సొంత వనరుల (63% సొంత పన్నులు, 14% పన్నేతర ఆదాయం) నుంచే వస్తోంది. జీఎస్‌డీపీలో సొంత పన్నుల వాటా 8.1%గా ఉంది. ఆదాయం ఇలా బలంగా ఉన్నప్పటికీ, బడ్జెట్ ప్రణాళిక మాత్రం దారుణంగా విఫలమవుతోంది.

**విద్య, వైద్యానికి మంగళం:**

రాష్ట్ర ఖజానాలో సంక్షేమం, సబ్సిడీలకు పెద్ద పీట వేస్తున్న క్రమంలో కీలకమైన మౌలిక రంగాలకు తీరని అన్యాయం జరుగుతున్నట్లు నివేదిక తెలిపింది. రెవెన్యూ ఆదాయంలో 14% సబ్సిడీలకే పోతోంది. ఇందులో సింహభాగం 76% కరెంట్ సబ్సిడీలకే వెళ్తుండటం గమనార్హం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో 12.4% వాటా ఇచ్చి దేశంలో రెండో స్థానంలో నిలిచారు. కానీ, భవిష్యత్ తరాలను నిర్మించే కీలక రంగాలను పూర్తిగా గాలికి వదిలేశారు. ప్రజారోగ్యంపై తెలంగాణ తన బడ్జెట్‌లో 4.8% మాత్రమే ఖర్చు చేస్తోంది. ఇది దేశంలోనే అత్యల్పం. విద్యారంగానికి చేసిన కేటాయింపులు 9.0% మాత్రమే. ఇది కూడా దేశంలోనే అత్యంత తక్కువ కావడం గమనార్హం. మౌలిక వసతులైన రోడ్లు, వంతెనల కోసం ఖర్చు చేస్తున్నది 1.9% మాత్రమే. సొంత ఆదాయం బలంగా ఉన్నా ఆ డబ్బంతా సబ్సిడీలకే పోతుండటం, మరోవైపు గ్యారెంటీల పేరుతో అప్పుల ఊబిలో కూరుకుపోవడం రాష్ట్రాన్ని ప్రమాదపు అంచున నిలబెట్టిందని నివేదిక హెచ్చరించింది. కీలకమైన విద్య, వైద్యం కుంటుపడటంతో రాబోయే తరాలపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయమని నివేదిక పేర్కొంది.

## చెరువు మధ్యలో పట్టా ఇస్తారా?

-మొదటిపేజీ తరువాయి

సరికాదన్నారు. కనీసం పిటిషనర్ల భూమిని సేకరించలేదని వారికి నోటీసులైనా జారీ చేయలేదన్నారు. అధికారుల నిర్ణయం ఏకపక్షం, రాజ్యాంగ, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని వాదించారు. పిటిషనర్ల పట్టా భూముల్లో జోక్యం చేసుకోకుండా అధికారులు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

**కలెక్టర్ రాకుంటే చర్యలు తప్పవు**

కొత్త ప్రాజెక్టు కట్టేప్పుడు మాత్రమే భూ సేకరణ చేస్తామని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములున్నా పరిహారం ఇచ్చే అవకాశం లేదన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెంచితే వారి భూములు మునిగిపోతాయి కదా అని అడిగారు. ప్రైవేట్ భూమిపై అధికారులు ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. ఏదైనా నీటిమట్టం పెంపుపై నిర్ణయం తీసుకునే అధికారం అధికారులకు ఉందని ఏజీపీ బదులిచ్చారు.

**ఆర్థిక సలహా సేవలు**

పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని ఏజీపీ కోరారు. ఈ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల అధికారులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఓ చెరువులో 27 ఎకరాలు పట్టా భూమి అని ఓ మాజీ ఎమ్మెల్యే ఈ కోర్టుకు వచ్చారు. చెరువు మొత్తం ఏరియా 37 ఎకరాలు. 37 ఎకరాల్లో 27 ఎకరాలకు ఎలా పట్టా ఇచ్చారో అధికారులకే తెలియాలి. అధికారుల తప్పిదానికి ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించాలని మరవొద్దు. ఎఫ్‌టీఎల్ భూములనీ అధికారులంటారు.. పట్టా భూములని ప్రైవేట్ వ్యక్తులంటారు. ఖమ్మం కేసులో 29 సర్వే నంబర్ భూమి స్వభావ పట్టా.. భూమి వివరణ మెట్ట అని అధికారులే పేర్కొన్నారు. కానీ, 29 సర్వే నంబర్ పూర్తిగా చెరువు మధ్యలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించని కారణంగానే ఇలాంటి పిటిషన్లన్నీ వస్తున్నాయి. రెవెన్యూశాఖను తొలగిస్తే తప్ప ఈ దేశం బాగుపడదు'అని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ వారం రోజులకు వాయిదా వేశారు. కౌంటర్ దాఖలు చేయని పక్షంలో ఈ కోర్టు తీసుకునే చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

# కారు గుర్తుకు ఓటువేస్తే కమలానికి వేసినట్లే

-మొదటిపేజీ తరువాయి

సవాల్ విసిరితే.. కిషన్‌రెడ్డి నాకు సవాల్ విసరుతున్నారు. నాతో చర్చలు జరపడం కాదు.. ఢిల్లీకి వెళ్లి మోదీ, అమిత్‌షాతో చర్చించండి. కేసీఆర్, కేటీఆర్ అరెస్టుకు ఎందుకు అనుమతించడంలేదని కొట్లాడండి" అని రేవంత్ ధ్వజమెత్తారు.

**జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ తెచ్చుకుంటవా?**

కిషన్‌రెడ్డి భయపెడితే భయపడడానికి చిన్న పిల్లలు ఎవరూ లేరని సీఎం రేవంత్ అన్నారు. "చాలా మందిని చూశాం. నియంతలా నీల్గిన కేసీఆర్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు బండకేసి కొడితే ఫామ్‌హౌజ్‌లో పండుకుండు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ తెచ్చుకుంటవా? డిపాజిట్ తెచ్చుకుంటే నువ్వు గెలిచినట్లే..! డిపాజిట్లు రాని నియోజకర్గంలో పర్యటనలు చేస్తూ బీఆర్ఎసను గెలిపించేందుకు కృషి చేస్తున్నావు. పార్టీని తాకట్టు పెట్టి కేసీఆర్‌ను కాపాడటం కాదు. కేసీఆర్, హరీశ‌రావు, కేటీఆర్‌లను ఎప్పటి వరకు బొక్కలో వేస్తావో చెప్పి జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడగాలి" అని సవాల్ చేశారు. కేటీఆర్ చర్చలకు సవాల్ అంటున్నారని, సవాల్ విసరడం, పారిపోవడం ఆయన జాతిలోనే ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కంటోన్మెంట్‌లో రూ.5 వేల కోట్ల అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే శ్రీగణేశ్ జీవోలు చూపిస్తే రాజీనామా చేయకుండా కేటీఆర్ పారిపోయారని ధ్వజమెత్తారు. సన్నాసులు సవాల్ విసిరితే కాంగ్రెస్ కార్యకర్తలు పట్టించుకోరన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్లలో ఉన్న చెత్త, తాగునీటి సమస్య, ఇండ్లపై విద్యుత్ తీగల సమస్యలకు బీజేపీ, బీఆర్ఎస్సే కారణమని ఆరోపించారు. 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉందని, ఎంపీగా బీజేపీ నేతను గెలిపించారని, తమకు అవకాశం రాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

**డబుల్ ఇళ్ల పేరుతో కేసీఆర్ మోసం..**

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. తాము రాబోయే రోజుల్లో జూబ్లీహిల్స్‌కు 4వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్ ముస్లింలను తపుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.




అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే వీళ్లకు వచ్చే సమస్య ఏమిటని ప్రశ్నించారు. మోదీ, అమిత్‌షా వచ్చి అడ్డుకున్నా మైనార్టీలకు పదవులు ఇస్తామన్నారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ ఏనాడూ సినీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. కృష్ణానగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సినీ కార్మికుల పిల్లలు, జీవితాల గురించి కేసీఆర్, కేటీఆర్ మాట్లాడలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక 24 క్రాఫ్టుల సినీ సంఘాలను ఇంటికి పిలిచి మాట్లాడానని, గద్దర్ అవార్డులు ఇస్తున్నామని గుర్తు చేశారు. నవీన్ యాదవ్ 30 వేల మెజారిటీతో గెలుస్తారని, షేక్‌పేట నుంచే 15 వేల మెజారిటీ వస్తుందని అన్నారు. రోడ్‌షోలో మంత్రులు వివేక్, అజారుద్దీన్, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేషకుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మెయినుద్దీన్ పాల్గొన్నారు.

**బీజేపీ తాకట్టులో బీఆర్ఎస్!**

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. ఆ పార్టీని బీజేపీకి తాకట్టు పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందుకే.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అక్రమాల కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడిచినా కేంద్రం ఇంతవరకూ స్పందించలేదన్నారు. ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్‌ను అనుమతి కోరితే కూడా ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎసల మధ్య రాజకీయ ఒప్పందమే లేకుంటే గవర్నర్ అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్.. ప్రమాదకరమని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటువేస్తే కమలానికి వేసినట్లేనని అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. ఎర్రగడ్డకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షరీఫ్ ఖురేషీ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్ ఫిలిం సిటీ ఏర్పాటు



హైదరాబాద్

హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిలిం సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి బుధవారం జూబ్లీహిల్స్‌లోని తెలుగు క్లబ్‌లో సినీ రంగ ప్రముఖులు, సినీ రంగ కార్మిక నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా మంది సినీ పరిశ్రమ గురించి చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు గానీ.. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, తెలంగాణలో కానీ సినీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే మేలు జరిగిందన్నారు. వేలాది మంది సినీ కార్మికుల జీవితాలను మెరుగు పర్చడానికి, చెన్నై నుంచి సినీ పరిశ్రమను తరలించినప్పుడు హైదరాబాద్‌లో సినీ స్టూడియోల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే భూములు ఇచ్చిందని గుర్తు చేశారు. అన్నపూర్ణ, పద్మాలయ, రామానాయుడు తదితర సినిమా స్టూడియోలు కాంగ్రెస్ ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే ప్రారంభమయ్యాయన్నారు. ఫిలిం క్లబ్‌కు సైతం కాంగ్రెస్ ప్రభుత్వమే స్థలం కేటాయించిందని భట్టి చెప్పారు. సీనియర్ నటుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సినీ కార్మికుల కోసం దివంగత సీఎం వైఎస్‌ను అడిగి మరీ చిత్రపురి కాలనీని ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా.., ఎటువంటి విజ్ఞప్తులు వచ్చినా పరిష్కారానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అన్ని భాషల వారిని అక్కున చేర్చుకునే గొప్ప నగరం హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, చక్కటి వాతావరణంతోపాటు తక్కువ ధరకే మానవ వనరులు లభిస్తాయని భట్టి పేర్కొన్నారు. ప్రతి సందర్భంలోనూ సినీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వాలు అండగా నిలబడ్డాయని, భవిష్యత్తులోనూ నిలబడతాయని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమ ఎంత బాగా ఎదిగితే అంత మందికి ఉపాధి లభిస్తుందని, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వం బలంగా ఉంటేనే సినీ పరిశ్రమ బాగా ఎదుగుతుందన్న భట్టి.. సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్‌తో మాట్లాడి 'మా' అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించి.. సినీ నటుల కల సాకారమయ్యేందుకు యత్నిస్తామన్నారు. భవిష్యత్తులో మంచి సినిమాలు రావాలి, చిన్న సినిమాలు కూడా రావాలని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రోడ్డు విస్తరణ షురూ

చేవెళ్ల



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిలో తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ప్రమాదకరంగా మారిన 46 కి.మీ. మేర విస్తరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ రహదారిలో మీర్జాగూడ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సును కంకర టిప్పర్ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 19 మంది మృతిచెందగా 34 మంది గాయపడిన విషయం తెలిసిందే. రోడ్డు విస్తరణ జరగకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఇరుకైన మార్గంలో నిత్యం ఎక్కడో అక్కడ ప్రమాదాలు జరుగుతుండడంతో రాకాసి రహదారిగా పేరు పొందింది. తాజాగా ఘోర ప్రమాదంతో స్థానికుల నుంచి విమర్శలు రావడంతో అధికారులు రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. నిర్మాణ పనులు దక్కించుకున్న మేఘా సంస్థ పోలీసు అకాడమీ నుంచి మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ వరకు 20 యంత్రాలతో పనులు ప్రారంభించింది. బీటీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లను తొలగించి, చదును చేస్తున్నారు. దీంతో రోడ్డు విశాలంగా కనిపిస్తోంది.

**పదేళ్ల క్రితమే మొదలైనా..**

ఈ రహదారి విస్తరణకు ఆమోదం లభించి పదేళ్లైనా నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ. మేర నాలుగు లేన్లుగా రహదారి విస్తరణకు కేంద్రం రూ.956 కోట్లు మంజూరు చేసింది. ఈ పనుల టెండరును 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ.786 కోట్లకు దక్కించుకుంది. భూ సేకరణను దాదాపు పూర్తి చేసి కొన్నిచోట్ల పనులు మొదలుపెట్టారు. అయితే రోడ్డు పక్కన ఉన్న వృక్షాలను తొలగిస్తుండడంపై పర్యావరణ ప్రేమికులు జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో పనులు ఆగిపోయాయి. ఇటీవల 765 మర్రి వృక్షాలను రక్షించేలా రహదారి అలైన్‌మెంట్ మార్పు చేసి మరో 150 వృక్షాలను వేరేచోటుకు తరలించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో 'సేవ్ బన్‌యాన్స్ ఆఫ్ చేవెళ్ల' సంస్థ కేసు ఉపసంహరించుకుంది. దీంతో ఎన్జీటీ ఇటీవల స్టే ఎత్తివేసి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# రండి.. పెట్టుబడులు పెట్టండి

హైదరాబాద్

జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ప్రజాపాలన%-%ప్రజావిజయోత్సవాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్%-%2025'నిర్వహించనుంది. వచ్చే నెల 8,9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలోని మీర్‌ఖాన్‌పేటలో ఈ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్ల కోసం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్ అధ్యక్షతన ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తవడంతోపాటు డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టిన రోజు కావడంతో ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ విజన్ రైజింగ్%-%2047 డాక్యుమెంట్‌ను విడుదల చేస్తారు. ఫ్యూచర్ సిటీ సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను అదే రోజు విడుదల చేయాలని నిర్ణయించారు. దీంతోపాటు కొత్త ఇండస్ట్రీ, మైనింగ్, ఎడ్యుకేషన్ పాలసీలను విడుదల చేస్తారు.

**ఏడుగురితో ప్రత్యేక కమిటీ**

టీజీ ఎస్‌పీడీసీఎల్, జలమండలి, హెచ్‌ఎండీఏ, ఐటీ, ట్రాన్స్‌కో, హౌసింగ్, ట్రాన్స్‌పోర్ట్ వంటి పలు ప్రభుత్వ విభాగాల సమన్వయానికి జయేశ్‌రంజన్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు వికాస్‌రాజ్, సంజయ్‌కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తాని యా, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డిలు సభ్యులుగా ఉన్నారు.

**ఫార్చ్యూన్%-%500 కంపెనీలకు ఆహ్వానం**

గ్లోబల్ సమ్మిట్‌కు ఫార్చ్యూన్%-%500 కంపెనీలకు ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్‌రోడ్ వంటి కీలక ప్రాజెక్టుల అభివృద్ధి ఎలా ఉంటుందో వివరించనున్నారు. రెండు రోజుల సదస్సులో ఫ్యూచర్ సిటీలో పలు ప్రభుత్వ విభాగాలకు భూములను కేటాయించనున్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి, టీజీఐఐసీ ఎండీ, ఫ్యూచర్ సిటీ కమిషనర్ శశాంక ఆధ్వర్యంలో ఎంఓయూ, అనౌన్స్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతినిధుల భద్రత ఏర్పాట్ల కోసం అదనపు డీజీ డీఎస్ చౌహాన్, ఐజీ ఎం.రమేశ్, రాచకొండ కమిషనర్ స్వుదీర్‌బాబులతో సెక్యూరిటీ అండ్ ప్రోటోకాల్ కమిటీని ఏర్పాటు చేశారు.

